క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐవీఆర్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని ఎల్లా హోటల్, హిల్‌రిడ్జ్ విల్లాస్, గోపీచంద్ అకాడమీ, ఎమ్మార్ ప్రాపర్టీస్. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్కీ ఫీడర్ పరిధిలోని జయభేరీ పైన్‌వ్యాలీ, కేర్ హాస్పిటల్, ఐడీబీఐ బ్యాంక్, బ్రహ్మ కుమారీస్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో ఉంటుందన్నారు.

కొండాపూర్ పరిధిలో..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కళాజ్యోతి పరిసరాలు, రాజ ప్రసాదం పరిసరాలు, మసీద్‌బండ క్రాస్ రోడ్, కల్లు కాంపౌండ్. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీసీఎల్ లేఅవుట్, మసీద్‌బండ మెయిన్‌రోడ్, ఎస్మార్ట్, మై హోం మంగళ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి కోరారు.

నేడు ఖాజాగూడలో బోనాలు

రాయదుర్గం: ఖాజాగూడలో కాటమయ్యస్వామి బోనాల వేడుకలను సోమవారం నిర్వహించేందుకు కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఖాజాగూడలోని కాటమయ్య దేవాలయం వద్ద సాయంత్రం 5 గంటలకు బోనాల వేడుకలు, తొట్టెల ఊరేగింపు ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

నేడు పీహెచ్‌సీలో భవన నిర్మాణానికి శంకుస్థాపన



రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రహేజా గ్రూపు సీఎస్ఆర్ నిధులతో నిర్మించే నూతన భవనానికి సోమ వారం శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాంధీ హాజరవుతారన్నారు. అదే విధంగా గోపీనగర్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని కూడా ప్రారంభిస్తారన్నారు.

రాయదుర్గంలో ప్రత్యేక క్యాంపెయిన్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని జీహెచ్‌ఎంసీ భవనంలో ఆదివారం బీఎల్‌ఓలు, జీహెచ్‌ఎంసీ అధికారుల ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు, అధికారులు అందుబాటులో ఉండగా పలువురు వచ్చి తమ పేర్లతో పాటు తప్పొప్పులను సరి చేసుకున్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన మురళికి మంజూరైన రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. అర్హులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణ గౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ముగిసిన హోరెకే ఎక్స్‌పో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హోరెకే (హోటల్స్, రెస్టారెంట్స్, కేటరింగ్) ఎక్స్‌పో 2023 ఆదివారంతో ముగిసింది. ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు విరివిగా పాల్గొని ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన 300 బ్రాండ్‌లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బేకర్స్, రెస్టారెంట్స్, హోటల్స్, హోమ్‌చెఫ్స్‌లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 20 కేటగిరిలలో 50 మందికి అవార్డులను అందజేశారు. నగరంలోని పలు హోటళ్ల నిర్వాహకులకు బయ్యార్, సెల్లార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

శేరిలింగంపల్లి: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్ ఫామ్ వికారాబాద్ వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి (55) పట్టాలపై పడుకున్నాడు. పర్బనీ రైలు వెళ్లడంతో తల తెగి పూర్తిగా చితికిపోయింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.



ప్లాట్‌ఫామ్ 6కు వెళ్లాలంటే ఇక్కట్లు పడాల్సిందే!

- రద్దీకి అనుగుణంగా విస్తరణకు నోచుకోని రోడ్డు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని డిమాండ్
- ట్రాఫిక్, రైల్వే అధికారులు చర్యలు చేపడితేనే సమస్య పరిష్కారం

శేరిలింగంపల్లి: వాహనాల రద్దీ అనుగుణంగా సౌకర్యాలు పెరగకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన లింగంపల్లి రైల్వే స్టేషన్‌పై అధికారులు దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు, రైల్వే అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ఇబ్బందులు తలెత్తుతున్నా ఆ దిశగా కనీస చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమతున్నాయి. లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్ ఫామ్ వెళ్లే ప్రయాణికులకు అష్టకష్టాలు పడుతున్నారు. పటాన్‌చెరు, కూకట్‌పల్లి, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ నుంచి నగరం, ఔటర్‌రింగురోడ్డు, ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్లాలంటే లింగంపల్లి ద్వారానే వెళ్లాల్సిందే. దీంతో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని 6వ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు నానా ఇక్కట్లు పడుతుంటారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యే..

లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల సంఖ్య ఏటా పెరుగుతోంది. తెల్లవారుజాము నుంచే ముంబాయి నుంచి హైదరాబాద్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్,



నర్సాపూర్, గౌతమి, కాకినాడ (ఏసీ), నారాయణాద్రి, ఫలక్‌నుమా నుంచి వాడి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తుంటాయి. వాటితో పాటు ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలు ఉండనే ఉంటాయి. ప్లాట్ ఫామ్ నెంబర్– 6 వైపు ప్రయాణికులను తీసుకెళ్లడం, స్టేషన్‌లో దించే క్రమంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. 6వ ప్లాట్ ఫామ్ వైపు ఉన్న రోడ్డు రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాలను అక్కడే టర్న్ తీసుకోవడం, ఆటోలు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో సమస్య మరింత జఠిలం అవుతోంది. ముఖ్యంగా లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు ఉదయం దూర ప్రాంతాల రైళ్ల ద్వారా వచ్చిన ప్రయాణికులను తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు సొంత వాహనాల్లో రావడం రోడ్డుపైనే వాహనాలను నిలపడంతో సమస్య తీవ్రం అవుతోంది, అదే విధంగా స్కూల్ బస్సులు కూడా రాకపోకలు, ఆటో స్టాండ్ కూడా రోడ్డుపైనే ఏర్పాటుతో సమస్యగా మారుతోంది.



లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్ ఫామ్ వైపు వాహనాల రద్దీ

వీటిపై దృష్టి సారిస్తే ఊరట..

- ప్రయాణికుల కుటుంబ సభ్యులు, స్నేహితులు తీసుకెళ్లేందుకు, స్టేషన్‌లో దించేందుకు ప్రత్యేకంగా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్లాట్ ఫామ్–6 వైపు ఆటో స్టాండ్‌ను రోడ్డుపై కాకుండా రైల్వే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి.
- రోడ్డు షోల్డర్స్‌ను డెవలప్‌చేసి, మధ్య డివైడర్‌ను ఏర్పాటు చేస్తే సమస్యను అరికట్టవచ్చు.
- వాహనాలను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకోవాలి.
- ఆర్టీసీ సంస్థ రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు మినీ బస్సులను నడిపితే ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుతుంది.
- మినీ ఆర్టీసీ బస్సులతో ఆర్టీసీకి ఆదాయం సమకూరడంతోపాటు ప్రైవేటు వాహనాల రాకపోకలు తగ్గి ట్రాఫిక్ సమస్య కొంత వరకు దూరమవడం ఖాయమంటున్నారు విశ్లేషకులు.

అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగింది



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని మహీంద్రా అశ్విత అపార్టుమెంట్స్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మానస పుత్రిక హరితహారం కార్యక్రమం అని కాలనీ వాసులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొనడం, మన తెలంగాణ రాష్ట్రం పట్ల, పుడమి పట్ల, సీఎం కేసీఆర్‌కు ఉన్న ఆపేక్ష, ప్రేమ అర్థం అవుతుందన్నారు. గడిచిన సంవత్సరాలలో గరిష్ట రికార్డు స్థాయిలో 273 కోట్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2015–16 నాటికి అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా, 2023 నాటికి 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగిందన్నారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖాళీ స్థలాలు, రోడ్లకిరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, ప్రసాద్, దేవేందర్, నారాయణ, కృష్ణ, నర్సింగ్ రావు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే..

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే

మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే అని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి ఎన్టీఆర్‌కాలనీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మర్రి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. యువత అంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, సీఎంకేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్‌లో కొత్త, పాత కలయికతో అందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. శేరిలింగంపల్లిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అయ్యాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. శ్రీనివాసరావు, రమేష్, మహ్మద్, ఎండీ హమీద్, రషీద్, షకీల్‌పాషా, మహబూబ్‌ఖాన్, అల్తాఫ్, నూర్‌భాషా పార్టీలో చేరారు.

ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కొనియాడారు. పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామంలో ఆదివారం శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు మహనీయుల చరిత్రలను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గవ్యాప్తంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణమాణిక్‌రెడ్డి, ఎంపీటీసీ శైలజ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని మల్లికార్జునహిల్స్, బ్యాంక్‌కాలనీ, వంధనపురి కాలనీలలో రూ.కోటి 20లక్షల సొంత నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

పటాన్‌చెరు టౌన్: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పరిధిలోని లయన్స్‌క్లబ్‌లో ఎంఎస్ఆర్ హాస్పిటల్ వైద్యులచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, శీనయ్య, పట్టణ పురప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పటాచెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో గోశాల ఎదురుగా నిర్మించనున్న సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్, భవాని మాత దేవాలయాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం అధ్యక్షుడు రాథోడ్, గౌరవ అధ్యక్షుడు మోహన్‌సింగ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ఫలాలు అసలైన లబ్ధిదారులకు అందడం లేదు’



బహిరంగ సభలో బీజేపీ నాయకులు

హఫీజ్‌పేట్: ప్రభుత్వ ఫలాలు అసలైన లబ్ధిదారులకు అందడం లేదని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్ రెడ్డి, శిల్ప ఎన్‌క్లేవ్ కాలనీలలో నిర్వహించిన బీజేపీ పార్టీ గడప గడపకూ రవన్న ప్రజాయాత్రలో ఆయన మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6.62 లక్షల ఓటర్లు ఉన్నారని కనీసం 600 మంది కన్నా డబుల్ బెడ్ రూమ్‌లు కట్టించారని ప్రశ్నించారు. లక్షల్లో జనాభా ఉంటే వందలలో ఇళ్లు కట్టించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రజాయాత్రలో నవతరెడ్డి, సింధురెడ్డి, రామ్‌రెడ్డి, ఎల్లేష్, గంగాధర్‌రెడ్డి, రాకేష్ దోబే, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

అల్విన్‌కాలనీ: ఇస్కాన్ సంస్థ మియాపూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిత్యాన్నదాన పథకానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్కాన్ మియాపూర్ ప్రతినిధులు పెద్ద మనస్సుతో గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. నిత్యాన్నదానం చేయటం చాలా గొప్ప విషయని కొనియాడారు. నిత్యాన్నదానం వాహనాన్ని ప్రారంభించటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఈ సంచార వాహనం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. పేదవాడి ఆకలి తీర్చే అక్షయ పాత్ర అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్, గోపరాజు, బాబ్జీ, రోజా, జోగిపేట బాలరాజు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన వాహనాన్ని ప్రారంభించి అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

బాలిక అదృశ్యం

మోతీనగర్: బాలిక అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లాపూర్ డివిజన్ పండిట్ నెహ్రూనగర్‌లో సయ్యద్ అజీముద్దీన్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అజీముద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం చేసి పడుకున్నారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి చిన్న కుమార్తె సానియా మీర్జా (16) కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అజీముద్దీన్ చుట్టుపక్కల, బంధువుల దగ్గర గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అల్లాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నాం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతన్నామని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణ పనులను వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని గతంలో వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లు స్థానంలో నూతన ఎక్కువ సామర్థ్యం కలిగిని డ్రైనేజీ పైపు లైన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలతో, గడువులోపు పూర్తి చేస్తే ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలమన్నారు. బస్తీ, కాలనీల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కాశీనాథ్ యాదవ్, శివరాజ్‌గౌడ్, రాజిరెడ్డి, ఉమేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రశాంతి, సూపర్ వైజర్ నరేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కోటి కుంకుమార్చన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ శ్రీ కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం కోటి కుంకుమార్చన, శ్రీ లలితా సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. శ్రీదత్త విజయనంద తీర్థ స్వామీజీ 20వ చతుర్మాస్య వ్రత దీక్షలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దత్తవిజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. కోటి కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

మోతీనగర్: ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన మంత్రి మోదీ తొమ్మిదేళ్ల విజయవంతమైన సుపరిపాలన సందర్భంగా అల్లాపూర్ డివిజన్ రామారావునగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, విజయ్, మల్లేష్, భాను, పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని కేఎస్‌నగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ లీడర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో కలిసి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఆడబిడ్డలను సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేర్చేందుకు తన వంతు సాయం అందిస్తామన్నారు. శ్రీనివాస్‌యాదవ్, అమ్రేష్ రాజు, విజయ్‌కుమార్, రేఖ పాల్గొన్నారు.

వెర్టిగో బాధితుల సరికొత్త యాప్

సాక్షి, సిటీబ్యూరో: వెర్టిగో అనారోగ్యం ఉన్నవారు రోజులో ఏ సమయంలోనైనా తమ ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించుకునేందుకు ఉపకరించే ‘వెర్టిగో కోచ్’యాప్‌ను డిజిటల్ హెల్త్ సొల్యూషన్ సంస్థ అబాట్ రూపొందించింది. దీనిని నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రూపకర్తలు మాట్లాడుతూ.. వెర్టిగో బాధిత రోగులు అన్ని రకాల సమాచారం పొందడంలో సహాయపడే తమ యాప్ జీవనశైలి ఎంపికలు, వ్యాయామ చిట్కాలను అందిస్తుందన్నారు. యాపిల్ యాప్‌స్టోర్, గూగుల్ ప్లేస్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

బీసీల రాజ్యాధికారం తెచ్చుకోవాలి

మోతీనగర్: వివేకానందనగర్ కాలనీ పీజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో హిందూ బీసీ మహాసభ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీల రాజ్యాధికార కోసం బీసీలంతా ఐక్యంగా ఉండి, బీసీలకే ఓటు వేసి, బీసీల రాజ్యాధికారం తెచ్చుకునే దిశలో ప్రయాణించాలన్నారు. వీపీసింగ్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతో తోడ్పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జెర్రిపేటి జైపాల్, జాతీయ బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర, కార్యదర్శి పర్వత సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐదుగుళ్ల పోచమ్మ ఆలయంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఘనంగా శ్రావణ మాస బోనాలు

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువైన పోచమ్మకు, మహంకాళి అమ్మవారికి ఆదివారం శ్రావణమాస బోనాలు సమర్పించారు. బోనాల కార్యక్రమానికి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డి హాజరయ్యారు. వీరికి కార్పొరేటర్ పుష్ప నగేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.సత్య నారాయణ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. –రామచంద్రాపురం(పటాన్‌చెరు)